# టీచింగ్ టెస్ట్

కథ

-రాగూర్ బాల మురళీకృష్ణ



"అమ్మా వెళ్ళొస్తా" అంటూ సరస్వతమ్మకు చెప్పి వీధిగుమ్మం దాటింది సరళ తన మొదటి ఇంటర్వ్యూ అంటెండవడానికి.

ఇంటర్వ్యూ 'లిటిల్ రాస్కెల్స్' అనే స్కూల్లో యు.కే.జి., ఎల్.కే.జి క్లాసులకు ఇంగ్లీషుచెప్పే పోష్టుకు.

పక్కింటి ఆంటీ "పిల్లలకు కాస్త ఆడుతూపాడుతూ చెప్తే బాగా అర్థమౌతుందమ్మాయ్" అంది.

అది మొదలు రిహార్సల్స్‌మీద రిహార్సల్స్ చేసి ఆ రోజు ఇంటర్వ్యూ అటెండ్ కావడానికి బయల్దేరింది సర*

★ ★ ★

'లిటిల్‌రాస్కెల్' పెద్ద పెద్ద అక్షరాలతో అందంగా ఉంది స్కూల్ బోర్డు.

తను వెళ్ళవలసిన స్కూల్ ఇదేనని నిర్ధారించుకుని లోపలికి అడుగుపెట్టింది సరళ. అక్కడ ఇంటర్వ్యూకి వచ్చిన జనం వెయ్యికి పైమాటే. 'ఒక్క ఇంగ్లీషు టీచరు పోస్టుకు ఇంతమందా? సరళకి భయమేసింది. ఇంతమందిలో తను నెగ్గుకు రాగలదా అనుకుంది.

ఇంతలో 'మిస్ సరళా బి.ఏ' ఎవరో అనౌన్స్‌మెంట్ చేశారు.

పిలుస్తోంది తననే .

ఇంటర్వ్యూలో ఏమడుగుతారో ఏమోనని లోలోపల భయపడ్తూనే ఇంటర్వ్యూ హాల్లో అడుగుపెట్టింది.

అతికష్టం మీద అక్కడున్న వాళ్ళందరికీ విష్ చేసింది. ఇంటర్వ్యూ కమిటీ మెంబర్స్‌లో ఒకావిడ....

"బీ సీటెడ్" అంటూ కుర్చీని చూపించింది.

యాంత్రికంగా కుర్చీలో కూర్చుంది సరళ.

సర్టిఫికెట్స్ అడిగారు వారు.

తీసి చూపించింది సరళ.

తనకిష్టమైన ఒకరైమ్‌ను టీచ్ చెయ్యమన్నారు.

పక్కింటి ఆంటీని మనసులో తల్చుకుని క్లాస్ రూమ్‌కెళ్ళింది. ఇంటర్వ్యూ బోర్డు కమిటీమెంబర్లు క్లాస్‌రూమ్‌లో వెనకబెంచీలో కూర్చున్నారు.

మళ్ళీ ఓసారి పక్కింటి ఆంటీని తల్చుకుని పాఠం చెప్పడం మొదలెట్టింది సరళ.

కానీ ఎంత ప్రయత్నించినా గొంతు పెగలడంలేదు. కాలూచెయ్యీ ఆడటంలేదు. ఎవరో బలవంతంగా పట్టి ఆపేసినట్లు అన్నీ ఒక్కసారిగా ఆగిపోయాయి. తను పడ్తోన్న అవస్థకు క్లాస్‌లో ఓ కుర్రాడు కిసుక్కున నవ్వాడు. అవమానంగా ఫీలయి వెళ్ళి కుర్రాణ్ణి ఎడాపెడా వాయించేసింది.

★ ★ ★

"అబ్బా దీనికేం పోయేకాలమండీ మొన్నట్నుండి నిద్దర్లో ఏదేదో మాట్లాడుతోంది. చేతులు తిప్పుతుంది. ఈరోజేమో నానడుం విరగగొట్టింది." అంటూ ఇల్లు తుడుస్తున్న నీళ్ళని సరళ మొఖంమీద చిలకరించింది సరస్వతమ్మ.

నీళ్ళు మీదపడే సరికి "ఏరా వెధవ నామీదే వాటర్ పోస్తావా?" అంటూ పడక మీదనుంచి లేచింది సరళ.

ఈసారి సరస్వతమ్మ కాస్తంత ముందే తేరుకొని తనదోసిలిలో నీళ్ళు తీసుకొని సరళ మొఖంమీద పోసింది.



'సీ మేడమ్' అంటూ సరస్వతమ్మ వైపుకు వేలుపెట్టి చూపిస్తూ బలవంతంగా కళ్ళుతెరిచింది. ఎదురుగా సరస్వతమ్మ కనిపించేసరికి ఇదంతా కలే ననుకుని పక్కనున్న వాల్‌క్లాక్‌లో టైమ్ చూసింది. ఎనిమిదన్నర కావస్తోంది. తొమ్మి ది గంటలకు లిటిల్ రాస్కెల్స్‌కు సరళ వెళ్ళి రైమ్స్ ఎక్స్‌ప్లెయిన్ చెయ్యాలి.

మొన్న జరిగిన ఇంటర్వ్యూలో సరళ సెలెక్ట వడంతో టీచింగ్ టెస్ట్ పెట్టి ఫిల్టరైనవాళ్ళను మళ్ళీ ఫిల్టర్ చేస్తున్నారు లిటిల్ రాస్కెల్స్ స్కూల్ వాళ్ళు.

"మమ్మీ! నువ్వెప్పుడూ ఇంతే ఏడున్నరకి లేపమంటే ఇప్పుడా లేపడం' అంటూ సరస్వతమ్మ మీద ఎగిరిపడి త్వరత్వరగా స్నానం, టిఫిన్‌చేసేసి బయలుదేరింది సరళ.

"ఈసారి పిల్లలతో కలిసిపోయి ఆడుతూ పాడుతూ రైమ్స్ చెప్పెయ్యాలి." అనుకుంటూ దారంతా ఆలోచించింది.

స్కూల్ చేరుకునేసరికి తొమ్మిదిన్నర అయింది. వెంటనే హెడ్‌మిస్ట్రెస్ రూమ్‌కెళ్ళి ఒకవిష్ చేసేసి క్లాస్ చూపించమంది సరళ.

హెడ్ మిస్ట్రెస్ 'నేనూ వస్తాను' అంటూ బయల్దేరింది.

ఇద్దరూ క్లాస్‌రూంకి వెళ్ళారు. హెడ్‌మిస్ట్రెస్ చివరి బెంచీలో కూర్చుంది. సరళ ఒకొక్కరైమ్‌ని వివరంగా రాగయుక్తంగా పాడుతూ మధ్యమధ్యలో కాళ్ళకూ చేతులకూ పనిచెప్తూ ముగించింది తన టీచింగ్‌ని.

హెడ్‌మిస్ట్రెస్ బయటకొచ్చి సరళను వెయిటింగ్ రూమ్‌లో కూర్చోమంది. ఇంచుమించు పదకొండున్నర అవుతుండగా హెడ్‌మిస్ట్రెస్ వచ్చి...

"ఏమ్మా ఇంతబాగా డాన్స్‌చెయ్యగలవని మాకు మాటమాత్రంగాకూడా చెప్పలేదే" అంటూ అపాయింట్‌మెంట్ ఆర్డర్స్ సరళ చేతుల్లో పెట్టి లోపలికి వెళ్ళిపోయింది.

ఆవిడ ఏమంటుందో అర్థంగాక అపాయింట్‌మెంట్ లెటర్‌ను ఓపెన్‌చేసింది. అందులో ఇన్‌వర్టెడ్ కామాస్ మధ్యలో ఇరుక్కుని 'డాన్స్ టీచర్' అన్న పదం సరళను వెక్కిరించింది. తలమీదచెయ్యి వేసుకుని నెత్తీనోరూ బాదుకుంటూ డాన్స్ ఇనిస్టిట్యూ ట్స్ గాలించేందుకు బయల్దేరింది సరళ.

❖